కాసుల వేట.. వృక్షాల కోత

- కూటమి నాయకుల దారుణం!
- పచ్చని చెట్లను నరికేస్తున్న వైనం
- గతంలో వేప, ఇప్పుడు తుమ్మ చెట్లు
- పట్టించుకోని అధికారులు



పాత బొమ్మూరులో రజక చెరువు వద్ద తుమ్మచెట్టు నరికివేయగా మిగిలిన మోడు

రాజమహేంద్రవరం రూరల్: ఎన్నికల సమయంలో అనేక హామీలను ఇచ్చిన కూటమి ప్రభుత్వం.. అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించింది. దీంతో ప్రజలకు ఏమాత్రం మంచి జరగక పోగా, ఆ పార్టీల నాయకుల చేతలతో విస్మయానికి గురవుతున్నారు. కన్ను పడితే మాయం అనే చందాన యథేచ్ఛగా దోపిడీలు కొనసాగిస్తున్నారు. ఒక పక్క ఉచిత ఇసుక పేరుతో సొమ్ములు దండుకుంటున్న వైనం కొనసాగుతుండగానే.. పచ్చని చెట్లను దారుణంగా నరికివేస్తున్నారు. రూరల్ మండలం పాత బొమ్మూరు పరిధిలో చెట్లను అక్రమంగా నరికి సొమ్ము చేసుకుంటున్న ఘటనలు కొనసాగుతున్నాయి.

బరితెగింపు

ఆ ప్రాంతంలోని శ్మశాన వాటికలో వేలాది రూపాయల విలువైన వేప చెట్లు మాయం చేసిన ఘటనను మరువక ముందే రజక చెరువు వద్ద రెండు టన్నుల బరువు ఉండే తుమ్మచెట్లను కూడా కూటమి నాయకులు మాయం చేశారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. వేప చెట్ల మాయంపై నేరుగా కలెక్టర్‌కే ఫిర్యాదు చేసినప్పటికీ, సంబంధిత ఘటనపై విచారణ ఏమైందో తేలలేదు. దీంతో బరి తెగిస్తున్న కూటమి నాయకులు ఇప్పుడు తాజాగా తుమ్మ చెట్లను తరలించుకుపోయారని స్థానికులు చెబుతున్నారు. సహజ వృక్ష సంపదను ఈ విధంగా మాయం చేస్తున్నప్పటికీ రెవెన్యూ, పంచాయతీ, అటవీశాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం విడ్డూరంగా ఉందని గ్రామస్తులు అంటున్నారు.

అనధికారిక ఆమోదం?

కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిందే తడవుగా దోపిడీలకు తెరలేపారు. ప్రతి పనిలోనూ చేతికి అందిన కాడికి దోచుకుంటున్నారన్న ఆరోపణలు మూటగట్టుకుంటున్నారు. ప్రజలు బహిరంగానే ఈ విషయాలపై చర్చించుకుంటున్నప్పటికీ యథేచ్ఛగా దోపిడీలను కొనసాగిస్తున్నారు. ఇదే క్రమంలో పాత బొమ్మూరులో చెట్లను అక్రమంగా నరికి, సొమ్ములు చేసుకోవడానికి అధికారులంతా కలిసి అనధికారికంగా కూటమి నాయకులకు అనుమతులు ఇచ్చేసారా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

అభివృద్ధి పేరుతో..

రజక చెరువు వద్ద రోడ్డు అభివృద్ధి పనులను సాకుగా చూపి తుమ్మచెట్లు నరికేసి తరలించుకుపోయినట్లుగా స్థానికులుచెబుతున్నారు. వాస్తవానికి చెరువు గట్టు వెంబడి ఉన్న ఈ తుమ్మ చెట్లు రోడ్డు నిర్మాణానికి ఎటువంటి ఆటంకం కలగదని, అయినప్పటికీ చెట్లపై కూటమి నాయకులు కన్నేసి, సొమ్ములు చేసుకుంటున్నారంటున్నారు. గ్రామంలోని పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది సైతం ఈ దోపిడీపై దృష్టి పెట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గతంలో 31 వేప చెట్లను తరలించుకుపోతున్నప్పటికీ పంచాయతీ, రెవెన్యూ అధికారుల దృష్టికి రాకపోవడం ప్రజల అనుమానాలకు బలం చేకూరుస్తోంది. కూటమి నాయకుల దోపిడీకి అధికార యంత్రాంగం ఇదే రీతిలో సహకారమందిస్తే మున్ముందు పాత బొమ్మూరు ప్రాంతంలో పచ్చదనం కరువవుతుందన్న స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏపుగా పెరిగి నీడనిస్తున్న చెట్లను అక్రమంగా తరలించుకుపోవడం ఆపకపోతే పోరాటానికి దిగుతామని పలువురు హెచ్చరిస్తున్నారు.

ఆర్ట్స్ కళాశాలలో ‘ఓపెన్ ల్యాబ్ డే’



ఓపెన్ ల్యాబ్‌ను సందర్శించిన విద్యార్థులు

కంబాలచెరువు: జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఆర్ట్స్ కళాశాలలో సోమవారం ఓపెన్ ల్యాబ్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే మాట్లాడుతూ విద్యార్థుల్లో సైన్స్‌పై అవగాహన, పరిశోధనలపై ఆసక్తిని పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 600 పైగా విద్యార్థులు తరలి వచ్చి, సైన్స్ ప్రాజెక్టులను, అరుదైన సైన్స్ పరికరాలను, లాబొరేటరీలను ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ, పోస్టర్ ప్రెజెంటేషన్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు.

క్లుప్తంగా

బీజేపీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలి

రాజమహేంద్రవరం సిటీ: భారతీయ జనతా పార్టీని క్షేత్ర స్థాయిలో బలోపేతం చేసేందుకు నూతన మండల సారథులు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి పిలుపు నిచ్చారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో నూతన సారథులకు సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని దిశానిర్దేశం చేశారు. సంఘటన మంత్రి మధుకర్ మాట్లాడుతూ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పూర్వాధ్యక్షుడు బొమ్మల దత్తు, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

భావకవి కృష్ణ శాస్త్రికి పుష్పాంజలి



కృష్ణశాస్త్రి చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

కడియం: ప్రముఖ భావకవి దేవులపల్లి కృష్ణశాస్త్రి 45వ వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక హైస్కూల్ తెలుగు విభాగం ఆధ్వర్యంలో సోమవారం ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. హెచ్ఎం సత్యనారాయణ, తెలుగు ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ కృష్ణశాస్త్రి రచనలైన కృష్ణ పక్షం, ఊర్వశి తదితర కావ్యాలు, సినిమా పాటలు, జయజయ ప్రియభారతి వంటి దేశభక్తి గేయం, రేడియో నాటికలను వివరించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు శరత్‌బాబు, గిరిజ, పెర్సీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ రాఘవ కుమారి

సీటీఆర్ఐ: కంటి విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవ కుమారి అన్నారు. డిస్ట్రిక్ట్ బ్లైండ్ నెస్ కంట్రోల్ సొసైటీ సహకారంతో సోమవారం కళాశాలలో విద్యార్థినులకు కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024 డిసెంబర్ 30 తేదీన సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థినులకు కంటి పరీక్షలు నిర్వహించారన్నారు. ఆ సమయంలో కంటి లోపాలున్న 59 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేసినట్టు తెలిపారు. కంటి పరీక్షలు నిర్వహించిన డాక్టర్ ఎస్.ప్రసన్న కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సైకిళ్ల అందజేత

ప్రకాశం నగర్: గెయిల్ ఇండియా ఇటీవల నిర్వహించిన సైక్లోథాన్ ర్యాలీలో విజేతలుగా నిలిచిన ఎస్‌కేవీటీ విద్యార్థులకు సోమవారం సైకిళ్లు అందజేశారు. ఈ మేరకు కళాశాల ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డీవీ రమణ మూర్తి చేతుల మీదుగా ఎ.శ్రావణి, ఎల్.పద్మ, కె.ప్రభాస్‌లకు బహూకరించారు. కార్యక్రమంలో జి.శరత్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయునికి పూజలు

కడియం: కడియపులంక పాత పువ్వుల మార్కెట్‌లోని ఆంజనేయస్వామిని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సోమవారం దర్శించుకున్నారు. ఆమె వెంట ఆ పార్టీ నాయకులు ఉన్నారు.

పరీక్ష సామగ్రి వితరణ

కంబాలచెరువు: దానవాయిపేట మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులకు పరీక్ష అట్ట, పెన్ను, పెన్సిల్, స్కేల్, రబ్బర్ వంటి పరీక్షల సామగ్రిని పాఠశాల పూర్వ విద్యార్థులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్లస్ 2 పాఠశాలలను బలోపేతం చేయాలి

కంబాలచెరువు: ప్లస్ 2 పాఠశాలలను బలోపేతం చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రధానోపాధ్యాయ సంఘం రాష్ట్ర సహాధ్యక్షుడు కోలా సత్యనారాయణ అన్నారు. స్థానికంగా ఏర్పాటు చేసిన ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘ సమావేశంలో ఆయన మాట్లాడారు.

అత్యధిక కేసులు పరిష్కరించాలి

కంబాలచెరువు: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసులు పరిష్కరించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ గంధం సునీత అన్నారు. స్థానిక డీఎల్ఎస్ఏ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వివిధ శాఖల అధికారులు, న్యాయవాదులతో మాట్లాడారు.

కృషి విజ్ఞాన కేంద్రాలను వినియోగించుకోవాలి



రైతులను సత్కరిస్తున్న శేషుమాధవ్ తదితరులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ పరిధిలోని కలవచర్ల, కందుకూరు కృషి విజ్ఞాన కేంద్రాల సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ మాగంటి శేషుమాధవ్ అన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సోమవారం పీఎం కిసాన్ పథకం ద్వారా దేశవ్యాప్తంగా రైతులకు రూ.9.8 కోట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థ, కలవచర్ల కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్తంగా నిర్మా సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వెబ్‌క్యాస్ట్ ద్వారా ప్రధానిమంత్రి కార్యక్రమాన్ని రైతులు వీక్షించారు. డాక్టర్ మాగంటి శేషుమాధవ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ సంస్థ పేరును కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ నుంచి జాతీయ వాణిజ్య వ్యవసాయ పరిశోధన సంస్థగా మార్చిందన్నారు. ఈ మార్పులో భాగంగా పొగాకుతో పాటు అశ్వగంధ, మిరప, పసుపు, ఆముదం పంటలపై పరిశోధనలు జరపాల్సిన బాధ్యత తమపై ఉందన్నారు. కలవచర్ల కేవీకే హెడ్ డాక్టర్ వీఎస్‌జీఆర్ నాయుడు మాట్లాడుతూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో రైతు ఉత్పత్తి దారుల సంస్థల ఏర్పాటుకు కేవీకే ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రస్తుతం తమ ఆధ్వర్యంలో పందూరు గ్రామంలో మైత్రి, కరప గ్రామంలో శ్రేష్ఠ అనే రెండు రైతు ఉత్పత్తిదారుల సంస్థలు ఉన్నాయన్నారు. అనంతరం మాధవరాయుడుపాలేనికి చెందిన అన్నందేవుల చంటి, దుర్గాడ గ్రామానికి చెందిన కోమాకుల వెంకటేశ్వరరావు, అనపర్తికి చెందిన గుత్తుల మంగారత్నంను సత్కరించారు. కార్యక్రమంలో కేవీకే ఉద్యాన పంటల అధికారి జేవీఆర్ సత్యవాణి, డాక్టర్ బి.నాగేశ్వరరెడ్డి, సంజయ్ వినయ్ హెగ్డే, రఘునందన్, రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలి



గోదావరిలో చెత్తను తొలగిస్తున్న గోదావరి పరిరక్షణ సమితి సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించేందుకు వచ్చే భక్తులకు ఏ విధమైన ఇబ్బంది లేకుండా ఘాట్లలో తాత్కాలిక మరుగు దొడ్లు ఏర్పాటు చేయాలని గోదావరి పరిరక్షణ సమితి అధ్యక్షుడు డాక్టర్ టీకే విశ్వేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం గోదావరి గట్టున ఉన్న మార్కండేయేశ్వరస్వామి రేవును సమితి సభ్యులు శుభ్రపరిచారు. విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ శివరాత్రి రోజు లక్షల మంది గోదావరిలో పుణ్యస్నానం ఆచరించడానికి వస్తుంటారని, వారికి ఏ విధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. కొవ్వూరు నుంచి నాలుగో బ్రిడ్జి మీదుగా వచ్చే వాహనాలను కాతేరు దగ్గర దింపకుండా, కొంతమూరు దగ్గర దిగేటట్లు ట్రాఫిక్ పోలీసు చర్యలు చేపట్టాలన్నారు. భక్తులను గోదావరి ఒడ్డున ఉన్న యాచకులు ఇబ్బంది పెడుతున్నారని, వారిని అక్కడి నుంచి తరలించాలన్నారు. రాజమహేంద్రి మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎంకేఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్ల పరిశీలన



కాలువ ఘాట్‌ను పరిశీలిస్తున్న అధికారులు

కడియం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే ఘాట్లను ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ ఎం.సునీల్ కుమార్ సోమవారం పరిశీలించారు. కోటిపల్లి కాలువపై కడియపులంక వద్ద గల రేవులను పరిశీలించి, సిబ్బంది పలు సూచనలు ఇచ్చారు. అక్కడి పారిశుద్ధ్యం, భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వారి వెంట పంచాయతీ, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చోరీ కేసులో నిందితులకు జరిమానా

రాజమహేంద్రవరం రూరల్: చోరీ కేసులో సీటీఆర్ఐ ప్రాంతానికి చెందిన తెలమశెట్టి సాయిభార్గవ్, లాలాచెరువు ప్రాంతానికి చెందిన గెద్దాడ సునీల్ కుమార్, ఘంటసాల చిరంజీవి రాజేష్‌కుమార్‌కు రూ.3 వేలు చొప్పున జరిమానా విధిస్తూ ఆరో ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి రెడ్డి ప్రసన్న సోమవారం తీర్పునిచ్చారు. 2018 నవంబరులో మోరంపూడిలోని బీఎస్ గ్రానైట్స్‌లో వెర్నా కారు, ల్యాప్‌టాప్, ఇన్వర్టర్ బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. దానిపై సురేష్ చౌదరి ఫిర్యాదు మేరకు బొమ్మూరు ఎస్సై నాగబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కేసులో బొమ్మూరు పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ సాక్ష్యులను ప్రవేశపెట్టారు. నేరం రుజుకు కావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

గంజాయి వాడకంతో అనర్థాలు

సీతానగరం: గంజాయి వల్ల అనేక అనర్థాలు జరుగుతున్నాయని నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ అన్నారు. ఈ మేరకు సోమవారం వంగలపూడిలో సీఐ వై.సత్యకిశోర్, ఎస్సై డి.రామ్ కుమార్‌తో కలిసి యువకులు, స్థానికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గంజాయిని విక్రయించినా, రవాణా చేసినా ఈగల్ టోల్ ఫ్రీ నంబర్ 1972కు సమాచారం అందజేయాలన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోండి



సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

సీటీఆర్ఐ: భవన నిర్మాణ కార్మికులకు వంద రోజుల్లో సంక్షేమ బోర్డు ద్వారా సంక్షేమ ఫలాలు అందిస్తామన్న కూటమి నాయకులు.. అధికారంలోకి వచ్చాక విస్మరించారని భవన నిర్మాణ కార్మికుల సంఘం అధ్యక్షుడు బొజ్జ రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం నిరసన తెలియజేసి, అనంతరం ఆర్‌డీఓ కృష్ణనాయక్‌కు వినతి ప్రతం అందజేశారు. రామకృష్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 200 రోజులైనా కార్మికులకు ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. భవన నిర్మాణ కార్మిక సంఘాల సమాఖ్య ప్రధాన కార్యదర్శి దేవగుప్త శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని, తద్వారా కార్మికులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రాజమహేంద్రవరం ప్లంబర్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు కొండపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ కార్మికులు పనులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు.

పురాతన వృక్షాలకు పునరుజ్జీవం



పూజలో పాల్గొన్న కలెక్టర్ ప్రశాంతి, న్యాయమూర్తి సునీత, ఎస్పీ నరసింహ కిశోర్ తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: పురాతన వృక్షాలకు పునరుజ్జీవం కల్పించేందుకు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమహేంద్రవరం ఐకాన్స్ నిరంతరం కృషి చేస్తోందని రోటరీ క్లబ్ చార్టర్ అధ్యక్షుడు తాగల రాజా అన్నారు. రాజమహేంద్రవరం జిల్లా కోర్టు ఆవరణలోని 90 ఏళ్ల రావిచెట్టుకు పునర్జీవనం కల్పించే లక్ష్యంతో అక్కడి నుంచి తొలగించి జిల్లా ఎస్పీ కార్యాలయంలో నాటే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకూ 21 వృక్షాలకు రక్షణ కల్పించామన్నారు. శాస్త్రోక్తంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో కలెక్టర్ ప్రశాంతి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత, ఎస్పీ డి.నరసింహ కిశోర్, క్లబ్ అధ్యక్షుడు ఇమ్మణి వెంకట్, సెక్రటరీ సురేష్ ఉదయగిరి, ప్రాజెక్ట్ చైర్మన్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

వంగలపూడి రేవులో నడక మార్గం పరిశీలన

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా వంగలపూడిలో గోదావరి రేవు వద్ద చేస్తున్న ఏర్పాట్లను ఎస్పీ నరసింహ కిశోర్, నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ వై.సత్య కిశోర్ సోమవారం పరిశీలించారు. గోదావరి పాయపై ఏర్పాటు చేసిన నడక మార్గాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. సైకిల్ స్టాండ్, తాగునీరు, అన్నదానం, వైద్యశిబిరాలు ఏర్పాటు చేయనున్న ప్రదేశాలను పరిశీలించారు. అన్ని శాఖల సిబ్బంది సమన్వయంతో పనిచేసి, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుజాత, ఉత్సవ కమిటీ సభ్యులు కొంచ భాస్కరరావు, మట్ట వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానజ్యోతి.. భవితకు పునాది

- అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ
- ప్రీ ప్రైమరీ చిన్నారులకు మెరుగైన బోధన



జ్ఞానజ్యోతి శిక్షణలో మాట్లాడుతున్న జిల్లా మహిళా సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం పీడీ విజయకుమారి



రంగంపేట హైస్కూల్లో శిక్షణ పొందుతున్న అంగన్‌వాడీ టీచర్లు

రంగంపేట: అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువులు కొత్త రూపు సంతరించుకోబోతున్నాయి. జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. మూడు నుంచి ఐదేళ్ల మధ్య వయసున్న చిన్నారులకు ఆటపాటలతో చదువులు అందించేలా జ్ఞాన జ్యోతి పేరిట ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలను కార్యోన్ముఖులుగా తీర్చిదిద్దేందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుంది. ఇందులో నేర్చుకున్న అంశాలను తరగతుల్లో బోధించడం వల్ల చిన్నారుల జీవితాల్లో వెలుగులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలకు విజ్ఞానంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉండాలన్న లక్ష్యంతో పోషణ్ బీ, పడాయి బీ పథకం అమలుపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. దానికి అనుగుణంగానే అంగన్‌వాడీ కేంద్రాల్లో సరికొత్త చదువులకు విద్యాశాఖాధికారులు పటిష్ట కార్యాచరణను రూపొందిస్తున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పునాది

పిల్లల అభివృద్ధికి మొదటి ఆరేళ్ల వయసు చాలా కీలకం. దీనిని దృష్టిలో ఉంచుకుని, మానసిక నిపుణుల సూచనల మేరకు ఎన్ఈపీలో ఈ వయసు వారికి ప్రాధాన్యమిచ్చారు. 0–6 సంవత్సరాల వయసున్న పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే అంగన్‌వాడీ కేంద్రాలే వారి భవిష్యత్తుకు దిక్సూచిగా నిలవాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలోనే బలమైన పునాదులు వేశారు. మన బడి నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మౌలిక వసతులు పెంపొందించడంతో పాటు ప్రతి కేంద్రానికి ఆట వస్తువుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించారు.

అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ

మాతా, శిశు సంక్షేమ శాఖ, విద్యా శాఖ, సర్వశిక్ష అభియాన్ సంయుక్త ఆధ్వర్యంలో ప్రథమ్ స్వచ్ఛంద సంస్థ చొరవతో సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) ప్రోగ్రాంలో భాగంగా రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాల్లో శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. దీనిలో భాగంగా అనపర్తి మండలంలో 64 మంది, బిక్కవోలులో 67 మంది, రంగంపేటలో 46 మంది అంగన్‌వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్నారు. దీని వల్ల అనపర్తి మండలంలో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు ఉన్న 1,651 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 652 మంది చిన్నారులు, బిక్కవోలు మండలంలో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు ఉన్న 1,628 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 870 మంది చిన్నారులు, రంగంపేట మండలంలో ఆరు నెలల నుంచి మూడేళ్లలోపు 1,766 మంది, మూడేళ్ల నుంచి ఆరేళ్ల వయసున్న 597 మంది చిన్నారులు ప్రయోజనం పొందనున్నారు.

శిక్షణ లక్ష్యం

పిల్లల బాల్యారంభ సంరక్షణ, అభివృద్ధే ఈ కార్యక్రమం లక్ష్యం. శారీరక, సామాజిక భావోద్వేగం, నైతికత, మేధాభివృద్ధి, భాష – అక్షరాస్యత, సౌందర్య – సాంస్కృతిక అభివృద్ధి అనే ఐదు అంశాల ప్రమాణికంగా చిన్నారుల భవితకు భరోసా ఇవ్వడమే లక్ష్యంగా 120 రోజులు శిక్షణ ఇస్తారు.

మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు

అంగన్‌వాడీలకు మూడేళ్ల సర్టిఫికెట్ కోర్సు అందిస్తారు. మూడేళ్ల వ్యవధిలో ఏడాదికి 40 రోజుల చొప్పున మొత్తం 120 రోజులు శిక్షణ అందిస్తారు. తొలిదశలో 20 రోజులు, మలి దశలో 20 రోజుల చొప్పున కొనసాగుతున్న ఈ శిక్షణను హైబ్రిడ్ విధానంలో నిర్వహిస్తారు. అంటే ఆరు రోజుల పాటు ఆఫ్‌లైన్, 14 రోజుల పాటు ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ తరగతులు కొనసాగుతాయి. విద్యాశాఖ, సర్వశిక్ష అభియాన్, మహిళా శిశు సంక్షేమ శాఖకు చెందిన ఆరుగురు డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్స్ పర్యవేక్షణలో తరగతులు నిర్వహిస్తున్నారు.

సులభతర బోధనకు శిక్షణ



ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్యా బోధన జరుగుతోంది. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రాథమిక విద్యను 1, 2 తరగతుల చిన్నారులకు సులభతరంగా బోధించుటకు జ్ఞాన జ్యోతి శిక్షణ ఎంతగానో దోహదపడుతుంది.

– జె.జెస్సీఫ్లోరెన్స్, సీడీపీఓ, రంగంపేట ఐసీడీఎస్ ప్రాజెక్టు

ఎంతో ఉపయోగం



చిన్నారుల చదువులకు తొలి అడుగులు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే పడతాయి. అక్కడి నుంచే పాఠశాలలకు వస్తారు. అందువల్ల ప్రీ ప్రైమరీ స్థాయిలోనే నైపుణ్యతతో కూడిన చదువులు అందించేందుకు ఇటువంటి శిక్షణ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది.

– ఎన్‌వీ రమణాంజలి, ఐసీడీఎస్ సూపర్ వైజర్, రంగంపేట

పక్కాగా తరగతులు



జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా ప్రీ ప్రైమరీ స్కూళ్లపై దృష్టి సారించాం.వివిధ ప్రోగ్రామ్‌లలో భాగంగా ఇప్పటికే 1, 2 తరగతులు బోధించే ఉపాధ్యాయులు శిక్షణ పొందారు. ఇప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలకు 120 సర్టిఫికెట్ కోర్సులో భాగంగా శిక్షణ ఇస్తున్నాం. ఇందులో మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– కె.శ్రీనివాసరావు, ఎంఈఓ, రంగంపేట మండలం